గ్రామాలు మునిగితేగానీ స్పందించరా?

● అధికారులను నిలదీసిన ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, న్యూస్‌టుడే: ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు సరైన పరిహారం ఇవ్వలేదు.. జాతీయ రహదారి పక్కన మురుగునీటి కాలువలు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.. భారీ వర్షాలు కురిస్తే పలు గ్రామాల్లోకి ఆ నీరు వెళ్లే ప్రమాదం ఉంది.. టోల్‌గేట్లు పెట్టి వసూళ్లపై పెట్టిన శ్రద్ధను భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారంపై జాతీయ రహదారి అధికారులు ఎందుకు చూపడం లేదని ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రశ్నించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారి పక్కన కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు సంబంధించి శుక్రవారం డీఆర్వో పుల్లయ్య అధ్యక్షతన రైతులతో సమావేశమయ్యారు. జాతీయ రహదారి పక్కన ఉన్న పాకాల మండలంలో రెండు గ్రామాలు, పూతలపట్టు మండలంలోని రైతులను సమావేశానికి ఆహ్వానించగా.. సమావేశం గురించి తమకు తెలియజేయలేదని కొందరు వాపోయారు. ఈ విషయాలన్నింటిపై అధికారులను ఎమ్మెల్యే నిలదీశారు. ఇలాంటి సమావేశాలకు ఉన్నతాధికారులు పాల్గొనకపోవడాన్ని తప్పుబట్టారు. ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ గుర్రప్ప, ఇతర శాఖల అధికారులు, పలు గ్రామాలకు చెందిన రైతులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తిరుచ్చిపై శ్రీపద్మావతీ అమ్మవారు



శ్రీపద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చిపై తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– న్యూస్‌టుడే, తిరుచానూరు

సర్వ దర్శనానికి 8 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా శుక్రవారం తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల భక్తులకు 3 గంటలు పడుతోంది. గురువారం శ్రీవారిని 61,004 మంది దర్శించుకున్నారు. రూ.3.48 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను తితిదే ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. శుక్రవారం తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరితో కలిసి తిరుమలలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. వకుళమాత కేంద్రీయ వంటశాలను పరిశీలించిన ఈవో అనంతరం నూతనంగా నిర్మిస్తున్న పీఏసీ-5ను తనిఖీ చేశారు. కౌస్తుభం, సప్తగిరి, ఎస్ఎంసీ, షాంపింగ్ కాంప్లెక్స్ వద్ద హోటళ్లను పరిశీలించారు. శిలాతోరణం వద్ద తనిఖీలు చేపట్టారు. ఔటర్ రింగ్‌రోడ్డులో నిర్మిస్తున్న నూతన క్యూలైన్‌లు, మరుగుదొడ్లు, ఫుడ్ కోర్టులను పరిశీలించారు. సీఈ సత్యనారాయణ, ఈఈ వేణుగోపాల్, సుబ్రమణ్యం, డీఈ చంద్రశేఖర్, ఎస్టేట్స్ అధికారి వెంకటేశ్వరులు, డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, అధికారులు పాల్గొన్నారు.



నూతన క్యూలైన్‌ను పరిశీలిస్తున్న ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి అధికారులు

సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: గత ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలపై వచ్చిన వినతులు మళ్లీ రాకుండా వాటిని సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం అన్ని శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రజల నుంచి వచ్చిన వినతుల పరిష్కారానికి నిర్దేశిత సమయం ఇస్తున్నట్లు చెప్పారు. క్షేత్రస్థాయి పరిశీలన, సర్వే చేయాలని, అవసరమైతే ఉన్నతాధికారులకు బదలాయించాలని సూచించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన ప్రతి వినతిని ఆడిట్ చేస్తామన్నారు. ఫిర్యాదుదారుల్లో కొంత మందికి నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారంపై ప్రజా స్పందన తెలుసుకుంటామని చెప్పారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది హాజరును ఎంపీడీవోలు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జేసీ విద్యాధరి, కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

వసతి లేని గృహాలు

దెబ్బతిన్న కిటికీలు.. తలుపులు లేని మరుగుదొడ్లు

విద్యార్థులను వేధిస్తున్న సమస్యలు

జిల్లాలోని వసతిగృహాలు	బీసీ	ఎస్సీ	ఎస్టీ	విద్యార్థుల సంఖ్య
	38	57	6	6,400

ఈనాడు, చిత్తూరు; న్యూస్‌టుడే బృందం:

సొంతూళ్లు వదిలి చదువుకునేందుకు మండల కేంద్రాలు, పట్టణాలకు వచ్చిన విద్యార్థులను వసతిగృహాల్లోని సమస్యలు వెక్కిరిస్తున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు విని, పుస్తకాలతో కుస్తీ పట్టి వచ్చిన చిన్నారులు రాత్రిళ్లు కునుకు తీయడానికి ఇబ్బందులు పడుతున్నారు. విరిగిన కిటికీలు, అడ్డుగా లేని మెష్‌ల కారణంగా చలికి గజగజా వణుకుతూ ప్రత్యక్ష నరకం అనుభవిస్తున్నారు. వాన కురిస్తే పై నుంచి నీళ్లు పడుతుండటంతో కంటికి నిద్ర ఉండటంలేదు. ఇలాంటి అవస్థలు తీరుస్తానని ఐదేళ్లపాటు వైకాపా ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందే తప్ప ఆ స్థాయిలో నిధులు విడుదల చేయలేదు. వసతిగృహాల్లోనూ 'నాడు- నేడు' కింద పనులు చేస్తానని హామీ ఇచ్చిన నాటి ముఖ్యమంత్రి జగన్.. విద్యార్థులను గాలికి వదిలేసి వేడుక చూశారు. వీరి ఇక్కట్లు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయి? ఎంత వ్యయమవుతుందనే అంశంపై అంచనాలు రూపొందించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని త్వరగా నిధులు వచ్చేలా చూడాలని విద్యార్థులు కోరుతున్నారు.

బంగారుపాళ్యం



వంట గదిలో నిద్రిస్తున్న విద్యార్థులు

బంగారుపాళ్యం గిరిజన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు నుంచి పదో తరగతి వరకు 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. అనుబంధంగా ఉన్న వసతిగృహ భవనం శిథిలావస్థకు చేరింది. గదుల కొరతతో రాత్రి భోజనం చేసిన చోటే ఐదు తరగతుల విద్యార్థులు పడుకుంటున్నారు. మరికొందరు తరగతి గదుల్లో నిద్రిస్తున్నారు. రెండుచోట్లా ఫ్యాన్లు లేవు. ఈ ఏడాది దుప్పట్లు ఇవ్వకపోవడంతో కార్పెట్లు కప్పుకొంటున్నారు.

కల్లూరు

పాముల బెడద

పులిచెర్ల మండలం కల్లూరు బీసీ వసతి గృహంలో 130 మంది విద్యార్థులున్నారు. కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో దోమల బెడద వేధిస్తోంది. ఎనిమిది మరుగుదొడ్లకు రెండు మరమ్మతులకు గురయ్యాయి. ప్రహరీ లేకపోవడంతో పాముల బెడద వెంటాడుతోంది. గతేడాది నవంబరు నుంచి విద్యార్థులకు క్షవరం, సబ్బులకు డబ్బులు రాలేదు. ఈ ఏడాది కార్పెట్, దుప్పట్లు ఇవ్వనందున చలికి చిన్నారులు వణుకుతున్నారు.



వినియోగంలో లేని మరుగుదొడ్లు

పుత్తూరు



మెష్‌లు లేని కిటికీలు

పుత్తూరు ఎస్సీ గురుకుల పాఠశాలలో 104 మంది చదువుతున్నారు. ఉదయం తరగతులు వినేచోటే రాత్రిళ్లు విద్యార్థులు నిద్రపోతున్నారు. కిటికీలకు మెష్‌లు లేకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. వాటిని మూసేస్తే ఉక్కపోతతో నరకయాతన అనుభవిస్తున్నారు.

చిత్తూరు



తలుపులు లేని మరుగుదొడ్లు

చిత్తూరు నగరం సంజయ్ గాంధీ నగర్‌లోని ఎస్సీ బాలుర వసతిగృహంలో బోరు ఉన్నా నీళ్లు నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. దీంతో ఎక్కువ మంది విద్యార్థులున్న సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు నీరు కావాలంటే కొంతసేపు వేచి చూడాల్సిందే. మరుగుదొడ్లకు తలుపులు లేవు. బీసీ బాలుర వసతిగృహంలోనైతే గదుల్లో దీపాలు లేవు. ఫ్యాన్లు తిరగడంలేదని, కిటికీలకు మెష్‌లు లేవని విద్యార్థులు వాపోతున్నారు.

పచ్చికాపల్లం



ప్రహరీ లేక భయం.. భయంగా

వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లంలో బీసీ, ఎస్సీ వసతి గృహాలున్నాయి. రెండింటిలో కలిపి 96 మంది ఉంటున్నారు. ఇవి గుట్టపై ఉండటంతో లోపలకు పాముల భయం విద్యార్థులను వెంటాడుతోంది. ప్రహరీ నిర్మాణానికి అధికారులు పలుమార్లు అంచనాలు వేశారే తప్ప నిధులు మంజూరు చేయలేదు. వార్డెన్లు, ఆ శాఖ అధికారులు కొందరు కలిసి దీపాలు వేయించడంతో పురుగూపుట్రా వస్తే కొంతవరకైనా కనిపిస్తున్నాయి.

కుప్పం

పెచ్చులూడుతున్న భవనాల్లోనే..

కుప్పం పాతపేటలోని బీసీ, ఎస్సీ బాలుర వసతిగృహాలు అధ్వానంగా ఉన్నాయి. రెండుచోట్లా వర్షం కురిస్తే గదులు ఉరుస్తున్నాయి. భవనాలు పెచ్చులూడుతున్నాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. దాహార్తి తీర్చుకునేందుకు విద్యార్థులే బయటి నుంచి డబ్బాల్లో నీరు తెచ్చుకుంటున్నారు. నీటిశుద్ధి యంత్రం ఉన్నా పనిచేయడం లేదు.



బైరెడ్డిపల్లి



భవన పైకప్పు దుస్థితి

బైరెడ్డిపల్లె ఎస్సీ బాలుర వసతి గృహ భవనం పెచ్చులూడుతోంది. కిటికీలు విరిగిపోయాయి. మరుగుదొడ్లకు తలుపులు లేవు. వైరింగ్ వేలాడుతోంది. స్విచ్ బోర్డులను తాకితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఫ్లోరింగ్ కూడా దెబ్బతింది.

హే.. కృష్ణా..!

● సాగునీటి జలాలు కరవు

● గత వైకాపా హయాంలో రూ.26కోట్లు వృథా

● అవస్థల్లో అన్నదాతలు

పాడైన ప్రాజెక్టు ప్రధాన గేట్లు



న్యూస్‌టుడే, కార్వేటినగరం

కృష్ణాపురం జలాశయంలో అభివృద్ధి పనులు ఆగిపోవడంతో అధ్వానంగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టు నిండితే సాగునీరు చెరువులకు సక్రమంగా సరఫరా అయ్యే పరిస్థితిలేదు. 2018లో తెదేపా ప్రభుత్వం సహకారంతో జైకా నిధులు రూ.26 కోట్లు మంజూరైనప్పటికీ.. వైకాపా పాలనలో ఐదేళ్లుగా అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో గుత్తేదారు అభివృద్ధి పనులను నిలిపివేశారు. దీంతో ప్రాజెక్టులో నీరు నిల్వలేక సాగునీటి కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నీరు సముద్రం పాలు..

అయిదు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ప్రాజెక్టు బాగోగులను పట్టించుకునే వారు కరవయ్యారు. వర్షాకాలంలో ప్రాజెక్టులో పూర్తి సామర్థ్యం మేరకు నీరు చేరినప్పటికీ ప్రధాన గేట్ల లీకుల వల్ల చెరువుల్లోకి నీరు సక్రమంగా సరఫరా కాక చేతికందిన సాగునీరు సముద్రం పాలవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆగిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేస్తారని రైతులు ఎదురు చూస్తున్నారు.

ప్రమాద స్థితిలో ప్రాజెక్టు గేట్లు..

ప్రధాన గేట్లు పాడవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. గేట్లకు అమర్చిన రబ్బరుస్టాంపు లీకేజీ అవుతోంది. రెండుమూడు చోట్ల లీకులు ఉండటంతో వరద వృథాగా నదిలోకి వెళుతోంది. ప్రధాన గేట్ల ద్వారా నిరంతరం సాగునీరు వృథా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కుడి, ఎడమ కాలువలు దుస్థితిలో ఉన్నాయి. జైకా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు అసంపూర్తిగా, నాసిరకంగా ఉన్నాయి. ఏడాది క్రితం గేట్ల ముందు నిర్మించిన రాక్ కాంక్రీట్ నాసిరకంగా మారి పాడైంది.

వరదలొస్తే..

వరద నీరు పూర్తి సామర్థ్యానికి చేరుకుంటే పాడైన ప్రధాన గేట్లు గల్లంతయ్యే అవకాశముంది. ఈ నీటిని కుడి ఎడమ కాలువల ద్వారా ప్రాజెక్టు దిగువ ఉన్న 16 చెరువులకు పంపాలి. గేట్లు పాడవడం, కాలువలు కబ్జాకు గురవడంతో సాగునీరు ఆరు చెరువులకే చేరుతోంది. ప్రాజెక్టు నిండితే ప్రధాన గేట్లు ఎత్తి వరదను కుశస్థలి నదిలోకి పంపాలి. గేట్లు ఎత్తడానికి అవసరమైన జనరేటర్ పాడైంది. బ్యాటరీ పనిచేయడం లేదు. ఐదేళ్లుగా గేట్ల మరమ్మతులకు నిధులు మంజూరు కాలేదు. ప్రాజెక్టు వద్ద 14 మంది సిబ్బందికి.. ప్రస్తుతం ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.

● పనుల పూర్తికి చర్యలు తీసుకుంటాం..: కృష్ణాపురం ప్రాజెక్టు అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. జైకా నిధులు విడదలయ్యాయి. పనులు వెంటనే ప్రారంభించాలని గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం. ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది కొరతగా వాస్తవమే. భారీ వర్షాలకు ప్రాజెక్టు నిండితే గేట్లు ఎత్తడానికి అన్ని ఏర్పాట్లు చేశాం.

– విజయకుమార్‌రెడ్డి, ఎస్ఈ

పనులు త్వరగా పూర్తిచేయాలి..

కృష్ణాపురం ప్రాజెక్టులో చేపడుతున్న అభివృద్ధి పనులు ఆగిపోవడంతో సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నీటిని ప్రాజెక్టులో నిల్వ చేసుకోవాలంటే త్వరగా పనులు పూర్తి చేయాలి. అభివృద్ధి పనులు ఆగిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.



– అనిల్, రైతు, అమ్మపల్లి

రైల్వే ప్రాజెక్టు పనుల్లో కదలిక

● సీఎం సమీక్షతో అడుగులు

● అధికారులతో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు



నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు భూసేకరణ సభలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో రైల్వే ప్రాజెక్టుల పనులు పట్టాలెక్కనున్నాయి. వైకాపా హయాంలో మరుగున పడ్డ దస్త్రాలను కూటమి ప్రభుత్వం దారికి తీసుకొస్తోంది. ఇందుకు సీఎం చంద్రబాబు ముగ్గురు అధికారులతో కలిసి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తాజా సమీక్షలో వెల్లడించారు. దీంతో రైల్వే పెండింగ్ భూసేకరణ తదితర పనుల్లో కదలిక రానుంది.

గాడిలో పెట్టే ప్రయత్నాలు

తిరుపతి కేంద్రంగా నిత్యం 130 రెగ్యులర్ రైళ్లు నడుస్తున్నాయి. ఇక్కడ స్టేషన్ రీ-డెవలప్‌మెంట్ ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. అనుసంధానం పెంచడానికి గతంలో తీసుకొచ్చిన అనేక ప్రాజెక్టులు వైకాపా ప్రభుత్వంలో అటకెక్కాయి. వాటిని గాడిలో పెట్టే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో డబ్లింగ్, ట్రిబ్లింగ్ పనులతో పాటు రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులున్నాయి. ఇవన్నీ మూడు, నాలుగేళ్లలో పూర్తి చేయడానికి ప్రణాళిక రచిస్తున్నారు.

భూసేకరణ అవసరం

రేణిగుంట-గూడూరులో 36.58 హెక్టార్ల భూమి సేకరించాల్సి ఉంది. ఇందులో మూడో లైన్ మార్గం 83.16 కి.మీ. మేర రూ.884 కోట్లతో పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకు ప్రధానమంత్రి గతి శక్తి కార్యక్రమంలో నిధుల కేటాయింపు జరగ్గా నాలుగేళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యం ఉంది. ఈ మార్గంలోని గ్రామాల్లో అండర్ పాస్‌లు, ఆధునిక సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు కానుంది.

● ఏర్పేడు-పూడి బైపాస్ లైన్: ఏర్పేడు-పూడి స్టేషన్ల మధ్య 25.36 కి.మీ మేర బైపాస్ లైన్ నిర్మించాలని ప్రతిపాదన ఉంది. దీన్ని ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించి నిర్వహణ, యాజమాన్యం, పర్యవేక్షణకు శ్రీకాళహస్తి ఆర్డీవోకు భూసేకరణ బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. లెవల్ క్రాసింగ్ వద్ద వంతెన.. రేణిగుంట స్టేషన్ సమీపంలో 72 ఎల్‌సీ నంబర్ వద్ద లెవల్ క్రాసింగ్ వద్ద వంతెన నిర్మించాల్సి ఉంది.

● మరిన్ని నిధులు: రైల్వే స్టేషన్ల ఆధునికీకరణలో చిత్తూరు, గూడూరు, రేణిగుంట, కుప్పం, పాకాల, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట స్టేషన్లను దశల వారీగా అభివృద్ధి చేయనున్నారు. వీటి ఎంపిక పూర్తి కాగా పనులు పట్టాలెక్కనున్నాయి. ఇందులో కుప్పం డిజైన్‌లో మార్పులు చేపట్టి మరిన్ని నిధులు తీసుకురావాల్సి ఉంది.

రూ.20 కోట్లు కేటాయింపు

నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో భూసేకరణకు రూ.20 కోట్లు కేటాయించారు. డక్కిలి మండలంలోని వివిధ గ్రామాల్లో ఇప్పటికే భూసేకరణ చేపట్టగా వారికి ఇంకా పరిహారం అందలేదు. తాజా పరిస్థితుల్లో నగదు చెల్లింపులు చేపట్టే వీలుంది. కొత్త మార్గాల్లో గూడూరు-దుగరాజపట్నం, తడ-శ్రీకాళహస్తి వరకు విస్తరణ ప్రణాళికలు ఉన్నాయి. వీటిని దశల వారీగా చేపట్టాల్సి ఉంది.

మరోసారి అధికారులకు షాక్

సేవలందించని వారిపై అపరాధ రుసుము

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు అధికారులకు ఏపీ ఈఆర్‌సీ షాక్ ఇచ్చింది.. విద్యుత్తు శాఖ పొరపట్టిక ప్రకారం వినియోగదారులకు సేవలందించడంలో జాప్యం ప్రదర్శించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు(ఏఈ), క్షేత్రస్థాయి అధికారులపై అపరాధ రుసుము విధించింది.. ఈ మొత్తాలను సంబంధిత ఇంజినీర్లు, అధికారుల వేతనాల నుంచి కోత విధించాలని ప్రతిపాదిస్తూ ఉత్తర్వులిచ్చింది.. సదరు నగదును వినియోగదారులకు చెల్లించాలని ఉత్తర్వులో పేర్కొంది.. ఇందులో భాగంగా ఈ ఏడాది జులై 1 నుంచి సెప్టెంబరు చివరి వరకు మూడు నెలల కాలంలో సేవలందించని అధికారులపై రూ.20.62 లక్షల అపరాధ రుసుము విధించారు.



ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యుత్తు శాఖ పరిధిలో ఎనిమిది డివిజన్లు ఉండగా.. వీటి పరిధిలో అన్ని రకాలకు సంబంధించి సుమారు 19.55 లక్షల సర్వీసులు ఉన్నాయి. సర్కిల్ 99 సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. నూతన సర్వీసుల జారీలో జాప్యం, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ ద్వారా ప్రస్తావనకు వచ్చిన సమస్యలు, పనుల అంచనా విలువల తయారీలో జాప్యం, స్తంభాలు, లైన్లు, మీటర్ల మార్పు, అధిక బిల్లింగ్ సమస్యలను పొరపట్టిక ప్రకారం పరిష్కరించకపోవడంతో 2,521 సర్వీసులకు సంబంధించి రూ.20,62,300 అపరాధ రుసుము విధించారు.

ఉమ్మడి జిల్లాలో వివరాలిలా..

డివిజన్	సర్వీసులు	అపరాధ రుసుము(రూ.ల్లో)
చిత్తూరు రూరల్	65	93,350
చిత్తూరు సిటీ	186	5,70,150
మదనపల్లె	119	69,650
పీలేరు	77	37,350
పుంగనూరు	186	3,28,350
పుత్తూరు	215	4,77,750
తిరుపతి రూరల్	141	1,03,550
తిరుపతి అర్బన్	1532	3,82,150

సంఖ్య తగ్గడం లేదు..

మూడేళ్ల నుంచి సకాలంలో సేవలందించని వారికి అపరాధ రుసుము విధిస్తోంది. అయినా ఆశించిన స్థాయిలో మార్పు రాలేదు. కొందరు అపరాధ రుసుము నుంచి తప్పించుకునేందుకు సీనియారిటీ జాబితాలో దరఖాస్తులు తొలగిస్తున్నారు. గడువు దాటిన వాటిని పక్కన పెట్టేస్తున్నారు. సేవా లోపం సమస్యలు పెరగడమే గానీ తగ్గడం లేదు.

14న సైన్స్ సెంటర్‌లో పోటీలు

తిరుపతి (జీవకోన): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో బాలల మూడో సైన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్టు సైన్స్ సెంటర్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ శుక్రవారం తెలిపారు. నవంబరు 14, 15 తేదీల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో సైన్స్ ఫెయిర్, సైన్స్ డ్రామా పోటీలు నిర్వహిస్తామన్నారు. వివరాలకు నంబర్లు 087722 86202, 79896 94681ను సంప్రదించాలన్నారు.

మెగా డీఎస్సీకి ఉచిత శిక్షణ

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ ద్వారా ఎస్.జి.టి, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత బోధన, వసతి కల్పించనున్నట్లు జిల్లా ఎస్.సి.సంక్షేమ, సాధికారత అధికారిణి రాజ్యలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత కలిగి, కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 27 లోగా www.jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



గాలులకు లేచిపోయిన పరికరాలు



శిథిలమవుతున్న ఎన్టీఆర్ జలాశయం గేట్లపై ఉన్న పరికరాలు



స్తంభాలపై బల్బులు కనుమరుగు



తుప్పు పడుతున్న పరికరాలు

అన్నా.. నీవే దిక్కు..!

చిత్తూరు నగర శివారులోని ఎన్టీఆర్ జలాశయం వద్ద ఉన్న యంత్రాలు, పరికరాలు శిథిలావస్థకు చేరాయి. జలాశయంపై ఏర్పాటు చేసిన గేట్లు తిప్పేందుకు యంత్రాలపై ఏర్పాటు చేసిన పరికరాలు చిలుము పట్టి రంధ్రాలు పడ్డాయి. రేకులు గాలికి ఎగిరిపోయాయి. కట్ట వెంట వేసిన విద్యుత్తు స్తంభాలకు బల్బులు లేక మొండిగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ప్రాజెక్టు నిండటంతో తిలకించేందుకు చుట్టుపక్కల ప్రజలు తరలి వస్తుండటంతో ఎవరినీ వెళ్లనీయకుండా గేట్లు మూసేశారు. ఈ మార్గం అధ్వానంగా మారడంతో ఆహ్లాదాన్ని పొందే అవకాశం లేక ప్రజలు నిరాశకు గురవుతున్నారు.



- ఈనాడు, చిత్తూరు

28న నిధి ఆప్కే నికట్ 2.ఓ

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్‌వో) వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 28న నిధి ఆప్కే నికట్ 2.ఓ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ కనౌజియా శుక్రవారం తెలిపారు. గుడిపాల మండలం వసంతపురంలోని సీఎన్ఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.



సరస్వతి నిలయమా..? పార్కింగ్ ప్రాంతమా..?

పట్టణంలోని తిరుపతి-అరక్కోణం రోడ్డు పక్కనే ప్రాథమికోన్నత ప్రధాన పాఠశాల ఉంది. కొన్నిరోజులుగా బయటి ప్రాంతాలకు వెళ్లేవారు పాఠశాల ఆవరణలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. అదే ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రం ఉంది. సుమారు 350 మంది పైచిలుకు విద్యార్థులు చదువుతున్నారు. ఈ నేపథ్యంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్‌తో నిత్యం మల మూత్ర విసర్జనకు వెళ్లాలన్నా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాహనాలు నిలపకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **-న్యూస్‌టుడే, పుత్తూరు**



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్మోహన్

ఆడుదాం ఆంధ్రతో వైకాపా దోపిడీ

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ప్రారంభం

ఐరాల, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రతో వైకాపా దోపిడీ చేసి రాష్ట్ర ఖజానా ఖాళీ చేశారని ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆరోపించారు. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌తో కలిసి కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 43వ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో క్రీడలకు పెద్దపీట వేస్తోందని, ఇందుకు ప్రత్యేక విధానం తీసుకురానుందని, ఓ కమిటీ సైతం ఏర్పాటు చేసిందన్నారు. కాణిపాకంలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖోఖో క్రీడకు మరింత ప్రాచుర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల ప్రవీణ్, కార్యదర్శి శరత్, తెదేపా మండల అధ్యక్షుడు గిరిధర్‌బాబు, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు హరిబాబునాయుడు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, జిల్లా క్రీడాధికారి బాలాజీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలు వీరే.. మొదటి రోజున జరిగిన పోటీల్లో బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు అనంతపురం జట్టుపై 8-3 తేడాతో గెలిచింది. పశ్చిమగోదావరి జట్టు కడపపై 8-7, విశాఖపట్నం జట్టు గుంటూరుపై 14-8, శ్రీకాకుళం.. విజయనగరం పై 9-3, బాలుర విభాగంలో నెల్లూరు, కడప జట్ల మధ్య జరిగిన పోటీల్లో 11-11 పాయింట్లతో డ్రాగా ముగిసింది.

రబీకి.. బీమా ధీమా

పంటల బీమా ప్రీమియం రైతులే చెల్లించాలి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: ప్రస్తుతం ప్రారంభమైన రబీ సీజన్(2024-25)కు సంబంధించి పంటల బీమాకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది.. 2019 ముందు నాటి పంటల బీమా విధానమే అమలుకు శ్రీకారం చుట్టింది.. ఖరీఫ్‌లో ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించి.. సాగు చేసిన రైతులందరికీ వర్తించేలా చర్యలు తీసుకుంది.. రబీలో రైతు వాటా కింద నామమాత్రంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంది.

చిత్తూరు జిల్లాలో రబీలో ప్రధానమంత్రి ఫసల్ బీమా, సవరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాలు అమలు చేస్తున్నారు. వరి, వేరుసెనగ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, టమాటా పంటకు వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని అమలు చేస్తున్నారు. వరి పంటను మండల యూనిట్‌గా, వేరుసెనగను జిల్లా యూనిట్, టమాటాను మండల యూనిట్‌గా అమలు చేయనున్నారు. జిల్లాలో పంటల బీమా పథకాల అమలును ఇఫ్కో, టాటా ఏఐజీ కంపెనీలకు అప్పగించారు.

జిల్లాలో ఎకరాకు వర్తించే బీమా, రైతు వాటా వివరాలు రూపాయల్లో..

పంట	బీమా	రైతు వాటా
వరి	42,000	84
వేరుసెనగ	30,000	60
టమోటా	25,000	1,250

ప్రీమియం చెల్లింపు ఇలా..

రుణాలు తీసుకోని రైతులు గ్రామ సచివాలయాలు, ఉమ్మడి సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్ కార్డు, పొలం ధ్రువీకరణ పత్రాలు, సీసీఆర్‌సీ కార్డు, సాగు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాసుపుస్తకం అందజేస్తే బీమా సౌకర్యం కల్పిస్తారు. ప్రీమియం చెల్లించవచ్చని జాతీయ పంటల బీమా పోర్టల్‌లో నమోదు చేయాలి. పంట రుణాలు తీసుకునే సమయంలో రైతుల నుంచి ప్రీమియం మొత్తాన్ని బ్యాంకులు మినహాయించుకుంటాయని అంగీకారం తెలియజేయకుంటే ఆ మొత్తం మళ్లీ వెనక్కి వస్తుంది. పంటల బీమాలో నమోదైన రైతులందరూ తప్పనిసరిగా ఈ-పంటలో నమోదు చేయించుకోవాలి. వరికి ప్రీమియం చెల్లింపు గడువు డిసెంబరు 31. వేరుసెనగ, టమాటా పంటలకు ప్రీమియం డిసెంబరు 15 లోగా చెల్లించాలి.

విస్తృతంగా అవగాహన..

పంటల బీమా పథకాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించనున్నాం. అధిక సంఖ్యలో రైతులు పంటల బీమా నమోదుకు దృష్టి సారిస్తాం. రైతు సేవా కేంద్రాలు, వ్యవసాయాధికారులను సంప్రదిస్తే బీమా పథకాల వివరాలు తెలియజేస్తారు.

- మురళీకృష్ణ, జేడీ, వ్యవసాయ శాఖ

భక్తిశ్రద్ధలతో రాహుకాలాభిషేకం

బోయకొండ (చౌడేపల్లె): బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాలాభిషేకం చేశారు. ఉదయం రాహుకాల సమయంలో చేసిన ఈ సేవకు అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రాతఃకాలంలోనే అమ్మవారికి సుప్రభాత సేవ, ప్రసాద నైవేద్యాలు సమర్పించారు. రాహుకాల సమయంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాభిషేకం నిర్వహించారు.



అలంకరణలో గంగమ్మ





రామకృష్ణ, దీపా వెంకట్‌కు స్వామివారి జ్ఞాపికలు అందజేస్తున్న ఏఈవో రవీంద్రబాబు, కోదండపాణి

గణనాథుడి సేవలో ప్రముఖులు

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని మాజీ సీఎం నందమూరి తారకరామారావు తనయుడు రామకృష్ణ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపా వెంకట్ శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు, కోదండపాణి, అర్చకులు రాజగోపురం వద్ద వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తెదేపా జాతీయ మీడియా కో-ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం.. కాణిపాకం : శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కడప వాస్తవ్యులు గజ్జల దినేష్‌రెడ్డి రూ.5 లక్షల మొత్తాన్ని ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు అందజేశారు.



విరాళం అందిస్తున్న దినేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	126
రిటైల్	148
లేయర్	110
బ్రాయిలర్స్	215
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	244
లేయర్ మాంసం	187

క్రీడలతోనే ప్రత్యేక గుర్తింపు

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

కర్నూలు క్రీడలు(బి.క్యాంపు), న్యూస్‌టుడే: క్రీడలతోనే ఎనలేని గుర్తింపు వస్తుందని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని డీఎస్ఏ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలబాలికల 68వ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ భానుమూర్తిరాజు, డీవీఈవో పరమేశ్వర్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న, కేవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ లాలప్ప, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీధర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ 13 జిల్లాల నుంచి 900 మంది బాలబాలికలు పోటీ పడుతున్నారన్నారు. ● బాలుర విభాగం: షాట్‌పుట్‌లో దిలీప్‌కుమార్ (చిత్తూరు) కాంస్య పతకం సాధించారు. హైజంప్‌లో సుదర్శన్ నాయుడు (చిత్తూరు) పతకం అందుకున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ జిల్లా జట్టు ఎంపిక

వడమాలపేట, న్యూస్‌టుడే: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో వడమాలపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బాలబాలికలకు వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ రెండో తేదీ నుంచి నాలుగో తేదీ వరకు గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరఫున పాల్గొననున్నారు. రాష్ట్ర స్థాయిలో మంచి ఫలితాలు సాధించాలని తిరుపతి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాబు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పీడీ చంద్రశేఖర్‌రాజు కోరారు. పీడీలు పుష్పవాణి, సాయి సుమతి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

● **జిల్లా బాలికల జట్టు:**

అశ్విని, మానస, పల్లవి(శ్రీ పద్మావతి జూనియర్ కళాశాల, తిరుపతి), రమ్య, సరస్వతి(బాలికల పాఠశాల రేణిగుంట), మానస, అన్నపూర్ణ, సుమిత్ర, యశ్వంతి(బాలుర ఉన్నత పాఠశాల, వడమాలపేట)

● **జిల్లా బాలుర జట్టు:**

సతీష్(పల్లం), గురు, దిలీప్, శంకర్, శేఖర్, ఉదయ్‌కుమార్, మగ్దుమ్, ఆలీ, సతీష్, శ్రావణ్‌కుమార్, వినయ్‌కుమార్, అనీష్, హర్షవర్ధన్(బాలుర ఉన్నత పాఠశాల, వడమాలపేట)

అదనపు జిల్లా జడ్జిగా ఉద్యోగోన్నతి

చిత్తూరు(న్యాయవిభాగం) : పలమనేరులో సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావు అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జిగా ఉద్యోగోన్నతి పొందారు. ఆయన్ను కృష్ణా జిల్లా నందిగామలోని 16వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేస్తూ శుక్రవారం రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

పంట ధ్వంసంపై ఫిర్యాదు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని తాతిరెడ్డిపల్లెలో ఓ వ్యక్తి జేసీబీలతో తమ ఉలవ పంటను ధ్వంసం చేసి.. తమపై దాడి చేశారని ఎస్సీ కులానికి చెందిన వెంకటలక్ష్మమ్మ శుక్రవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ దాఖలా సర్వే నంబరు 174/2లో 1.24 ఎకరాల భూమిని పూర్వీకుల కాలం నుంచి సాగు చేసుకుంటున్నామని చెప్పారు. తమ ఆధీనంలోని భూమికి రెవెన్యూ అధికారులు అగ్రకులానికి చెందిన మహిళ పేరిట పట్టా మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం 2020లో తెలియడంతో అప్పట్నుంచి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. పొలంలో ప్రస్తుతం ఉలవ పంట సాగు చేయగా జేసీబీలతో దౌర్జన్యంగా చదును చేస్తూ ధ్వంసం చేశారని చెప్పారు. ప్రశ్నించిన తమ కుటుంబీకులపై దాడి చేసి కులం పేరుతో దూషించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని బాధితురాలు కోరారు.



ఉలవ పంటను జేసీబీలతో ధ్వంసం చేస్తుండగా అడ్డుకుంటున్న బాధితులు

చెరువులన్నీ జలకళ సంతరించుకోవాలి

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: భగవంతుడి కృపతో జిల్లాలోని జల వనరులైన చెరువులు, జలాశయాలు పూర్తిగా జలకళ సంతరించుకోవాలని జలవనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం వేదపండితుల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీఎస్ఈ నాగభూషణం, ఈఈ గిరి, డీఈఈలు, ఏఈలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జలవనరుల అభివృద్ధికి రూ.2.05 కోట్లు

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం (రాష్ట్ర డిజాస్టర్ మిటికేషన్ ఫండ్) కింద ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని జలవనరుల అభివృద్ధిలో భాగంగా నాలుగు పనులకు రూ.2.05 కోట్లు కేటాయించారు. కార్వేటినగరం మండలంలోని కృష్ణాపురం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు రూ.30.88 లక్షలు, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు పునరుద్ధరణ పనులకు రూ.92 లక్షలు, తిరుపతి జిల్లా పరిధి కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ అభివృద్ధి పనులకు రూ.43 లక్షలు, అన్నమయ్య జిల్లా పరిధి నిమ్మనపల్లె మండలంలోని బహుదా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులకు రూ.40 లక్షలు కేటాయించారు. ఈ నాలుగు పనుల నిర్వహణకు పరిపాలనా పరమైన అనుమతులిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని జలవనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

త్వరలో మహిళలకు ఉచిత బస్సు సేవలు



ఆర్టీసీ బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు(కొంగారెడ్డిపల్లి), న్యూస్‌టుడే: చిత్తూరు నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై సహా పలు ప్రాంతాలకు ఏడు నూతన ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం స్థానిక బస్టాండులో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆర్టీసీలో ఉన్నత పదవులు అనుభవించినవారు ఒక్క కొత్త బస్సు తీసుకురాలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఐదు నెలల్లోనే 27 బస్సులు ప్రారంభించామని, తాజాగా మరో ఏడు వచ్చాయన్నారు. ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందుతునాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం త్వరలో ప్రారంభించనుందన్నారు. అపై ఆధునికీకరించిన కార్గో సేవల కార్యాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం బస్సులను ఆయనే గాంధీ విగ్రహ కూడలి వరకు నడిపారు. డీటీపీవో జగదీష్, డీఎంలు కృష్ణమూర్తి, రూపశ్రీ, చిత్తూరు మేయర్ అముద, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, తెదేపా నాయకులు వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

పక్కాగా పశుగణన నిర్వహించాలి

చిత్తూరు (జిల్లా పంచాయతీ): పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బీవీరెడ్డి కాలనీలోని తన నివాసంలో మేయర్ అముద, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించే పశుగణన పక్కాగా గణించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి కచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలన్నారు. బహువిధ పశువైద్యశాల డీడీ సుబ్బమ్మ, ఉప మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ఏడీ చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.



హోమ్‌గార్డు పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న ఎస్పీ మణికంఠ

హోమ్‌గార్డుల పిల్లలు చక్కగా చదువుకోవాలి

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: హోమ్‌గార్డుల పిల్లలు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్పీ మణికంఠ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన హోమ్‌గార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులు అందజేశారు. హోమ్‌గార్డులు పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారని, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో చురుగ్గా పాల్గొంటున్నారన్నారు. వారి పిల్లల విద్యకు ప్రోత్సాహం ఇచ్చి వారి సేవను గౌరవించడానికి స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామన్నారు. 18 మంది హోమ్‌గార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించారు. ఏఆర్ ఏఎస్పీ శివానందకిషోర్, ఏఆర్ డీఎస్పీ మహబూబ్‌బాషా, ఎస్‌బీ సీఐ భాస్కర్, ఆర్ఐలు సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి నోటీసు

చిత్తూరు విద్య : ఏడాదికి పైగా అనధికారికంగా పాఠశాలకు గైర్హాజరైన ఉపాధ్యాయురాలు ఎన్.అరుణకుమారికి సంజాయిషీ నోటీసు, ఛార్జెస్ జారీ చేశామని డీఈవో దేవరాజు శుక్రవారం తెలిపారు. బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లె ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ అరుణకుమారి గతేడాది జులై 31 నుంచి అధికారుల అనుమతి తీసుకోకుండా గైర్హాజరయ్యారు. దీనికి సంబంధించి ఉత్తర్వులు అందజేసేందుకు ఆమె పేర్కొన్న చిరునామాలో లేరని, వెంటనే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనివేళల్లో హాజరు కావాలని స్పష్టం చేశారు. లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

చిరుతను చంపిన ఐదుగురి అరెస్ట్

చిత్తూరు(జిల్లా పంచాయతీ) : యాదమరి మండలం తాళ్లమడుగు సమీప అటవీ ప్రాంతంలో చిరుతను హతమార్చిన ఐదుగురిని అరెస్టు చేశామని డీఎఫ్‌వోభరణి తెలిపారు. శుక్రవారం స్థానిక అటవీశాఖ పశ్చిమ విభాగం కార్యాలయంలో నిందితులను అరెస్టు చూపి చిరుత శరీర భాగాలు ప్రదర్శించారు. చిరుతను చంపిన వారిలో అనుమానితుడిగా బంగారుపాళ్యం మండలం సీజేఎఫ్ఎస్ కాలనీకి చెందిన వినాయకంను అదుపులోకి తీసుకుని విచారించగా, అతడిచ్చిన సమాచారం మేరకు బంగారుపాళ్యం మండలం వెలుతురుచేనుకు చెందిన ధర్మయ్య, మణికంఠ, వినాయకం, రాజామణి, మాణిక్యంను అరెస్టు చేశామని, వారి నుంచి చిరుత పాదాలు, పళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. చిరుతను చంపిన ప్రదేశంలో వారిని విచారించి ఎలా చంపారో తెలుసుకున్నట్లు వివరించారు. వారు నేరాన్ని అంగీకరించారని, ముందుగా విద్యుత్తు వైర్లు అమర్చి షాక్‌తో చంపి, అపై కత్తితో నాలుగు పాదాలు నరికారన్నారు. వారిని మూడో అదనపు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

తెదేపా ప్రధాన కార్యదర్శిపై.. వైకాపా శ్రేణుల దాడి

నిందితుల అరెస్టులో మీనమేషాలపై తెదేపా ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

పాలసముద్రం, న్యూస్‌టుడే: తెదేపా మండల ప్రధాన కార్యదర్శిపై వైకాపా శ్రేణులు దాడి చేసిన సంఘటన పాలసముద్రం మండలంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వనదుర్గాపురం పంచాయతీకి చెందిన, మండల తెదేపా ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు పాలసముద్రం నుంచి వనదుర్గాపురంలోని తన ఇంటికి గురువారం రాత్రి వెళ్తున్నాడు. ఆ సమయంలో అతడిని వైకాపా నాయకులు గురుప్రసాద్, శరవణకుమార్ అడ్డగించి దాడి చేయడంతో కడుపులో, మెడపై కనిపించని తీవ్రగాయాలయ్యాయి. ఆపై అతడిని బురదలో తోసేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేశామని, నిందితులు పరారీలో ఉన్నారని ఎస్సై భారతి తెలిపారు. అయితే రెండేళ్ల క్రితం సోషల్ మీడియాలో తనపై అసభ్యకర పోస్టులు పెట్టారని, దీనిపై అప్పట్లో నెలకొన్న వివాదం నేపథ్యంలో ఇప్పుడు తనపై దాడి చేశారని బాధితుడు శేఖర్‌రాజు వాపోయాడు.

● మరోవైపున నిందితులను అరెస్ట్ చేయడంలో పోలీసులు మీనమేషాలు లెక్కిస్తున్నారంటూ మండల తెదేపా నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట శుక్రవారం రాత్రి ధర్నా నిర్వహించారు. స్టేషన్ ఎదుట గంట సేపు ధర్నా చేపట్టారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు జోక్యం చేసుకుని సమస్యను ఎస్పీ మణికంఠ, ఎమ్మెల్యే థామస్, పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని చెప్పడంతో బాధితుడు, నాయకులు ధర్నా విరమించారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

లోక్‌అదాలత్ విజయవంతం చేయండి


రాఘవేంద్ర

పుత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో డిసెంబరు 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా అవుతాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారాన్ని అందించండి.. పాలసముద్రం: చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని పంచాయతీ ఈవోపీఆర్డీ మహేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నరసింహాపురం పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రాన్ని, సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈవోఆర్డీ రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా సభ్యత్వాలు.. పుత్తూరు: పార్టీ సభ్యత్వ నమోదును శ్రేణులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఓ ప్రకటనలో కోరారు. గుడిపాల: ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రారంభిస్తారని మండల పార్టీ కన్వీనర్ సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 80085 74568
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 80085 74601

న్యూస్‌టుడే, పాలసముద్రం
సమస్య: ఆముదాల పంచాయతీ రంగాపురం క్రాస్ వద్ద చిత్తూరు-బలిజకండ్రిగ ప్రధాన రహదారిని ఆనుకుని ఆదిఆంధ్రవాడ గ్రామానికి వెళ్లే తాగునీటి పైపులైను లీకై తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. -శరత్, గ్రామస్థుడు
సమాధానం: పైపులైన్లపై వాహనం ఎక్కడంతో పగిలిపోయింది. మరమ్మతులు చేసి తాగునీరు అందిస్తాం. - విద్యావతి, ఎంపీడీవో, పాలసముద్రం

న్యూస్‌టుడే, గంగాధరనెల్లూరు
సమస్య: స్థానిక రైతు భరోసా కేంద్రం సమీప రక్షిత మంచినీటి సరఫరా గేట్‌వాల్ పాడైపోయి నీరు వృథాగా పోతోంది. -రవిచంద్ర, స్థానికులు
సమాధానం: పంచాయతీ సిబ్బందిచే పాడైన రక్షిత మంచినీటి గేట్‌వాల్ బాగుచేయిస్తాం. -చంద్ర, పంచాయతీ కార్యదర్శి, జీడీనెల్లూరు

నీటి వృథాకు అడ్డుకట్ట

స్పందనకు వందనం

కావురివారిపల్లె పంచాయతీ రాజా వేమ గోపాలపురం వద్ద తాగునీటి కుళాయి నుంచి నీరు వృథా చేశారు. ఈ నెల 21న 'ఆలా వదిలేశారు' శీర్షిక నీటి వృథాపై చిత్రవార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి హేమలత నూతనంగా కుళాయి అమర్చి నీటి వృథా అరికట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. -న్యూస్‌టుడే, పెనుమూరు

ఉచిత ఇసుక విధానం తెదేపాకే సాధ్యం

పుత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలు తెదేపాకే సాధ్యమని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు పేర్కొన్నారు. ఇసుక ఉచిత విధానం అమలు చేయడంపై సీఎం చంద్రబాబు చిత్రపటానికి కార్వేటినగరం రోడ్డులో క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక ధర ఎక్కువగా ఉండటంతో భవన నిర్మాణ కార్యకలాపాలు తగ్గిపోయి, కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. నాయకులు బాలాజీనాయుడు, రవినాయుడు, ధనపాల్, పాండురంగయ్య, నాగరత్నం, విజయశేఖర్‌నాయుడు, మధుసూదనరాజు, విజయ్ పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విజయబాబు

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించండి

నగరి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారులపై ఉన్న ఆక్రమణలను దుకాణదారులు స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బస్టాండ్‌లో శుక్రవారం ఆయన స్వయంగా రోడ్డుపై దుకాణాలు పెట్టుకున్న వారిని హెచ్చరించారు. రెండ్రోజుల సమయం ఇస్తున్నామని, ఎవరికి వారు తొలగించుకోవాలని హెచ్చరించారు. టీపీవో మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణదారులను హెచ్చరిస్తున్న కమిషనర్ కృష్ణారెడ్డి

గుంతల్లో ఎగురుతున్న జెండాలు

అవస్థల్లో గ్రామీణులు


మురకంబట్టు వద్ద ప్రమాదాన్ని సూచిస్తూ నాటిన జెండా


పూనేపల్లి సమీపంలో..

ఈనాడు, చిత్తూరు, న్యూస్‌టుడే, పెనుమూరు: చిత్తూరు నగర శివారులోని తిరుపతి నుంచి చిత్తూరు వచ్చే మార్గంలోని మురకంబట్టు సమీపంలో జాతీయ రహదారిలో పడిన గోతితో నిత్యం ఎంతో మంది ప్రమాదం బారిన పడుతున్నారు. ఈ మార్గంలో అనేక మంది విద్యార్థులు సైతం రాకపోకలు సాగిస్తుంటారు. రెండ్రోజుల క్రితం మంగళవారం ఒక్కరోజే దాదాపు ఆరుగురు ద్విచక్ర వాహనచోదకులు కింద పడటంతో అక్కడే ఉన్న స్థానికులు ప్రమాదాన్ని సూచించేలా గుంతలో జెండా కట్టారు. మరోవైపు నగర శివారులోని మురకంబట్టు నుంచి పెనుమూరు వెళ్లే మార్గంలో పూనేపల్లి వద్ద రోడ్డుకు గోతి పడటంతో ఇక్కడా స్థానికులు జెండా ఎగురవేయటంతో ప్రమాదాలు కొంతమేర తప్పుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో నుంచి ఇవి ఇలాగే ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ మార్గంలో ఇలా..

పెనుమూరు-చిత్తూరు మార్గంలో మడియంపల్లె నుంచి పూనేపల్లె రోడ్డు వరకు రహదారి పూర్తిగా గుంతలతో నిండింది. చిత్తూరు-తిరుపతి రోడ్డు నుంచి పెనుమూరుకు 16 కి.మీ. ఉంది. ఈ మార్గంలో తారు వేసి మరమ్మతు పనులకు గత ఏడాది ర.భ. అధికారులు టెండర్లు నిర్వహించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు పనులను అరకొరగా ప్రారంభించారు. పెనుమూరు నుంచి మనియారంపల్లె వరకు మాత్రమే పనులు పూర్తి చేశారు. మిగిలిన రహదారి పూర్తిగా గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో ప్రయాణం ప్రాణ సంకటంగా తయారైంది. రాత్రుల్లో వాహనదారులు గుంతల్లో అదుపు తప్పి పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా ర.భ. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేసి గుంతలను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.


పెనుమూరు-చిత్తూరు మార్గంలో..

27న ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు(క్రీడలు), న్యూస్‌టుడే: జైన్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 27న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జైన్ సంఘం కార్యదర్శి సుభాష్‌జైన్ శుక్రవారం తెలిపారు. రాములవారిగుడి వీధిలోని జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 10 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఎంపికైన వారికి తిరుపతిలోని ఎస్వీ అరవింద కంటి ఆసుపత్రిలో శస్త్రచికిత్స ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతిభకు గుర్తింపు

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: పోటీ పరీక్షల్లో విద్యార్థులు తమ ప్రతిభ చాటుకోవాలని కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులసీబాబు కోరారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రతిభ పాటవ పోటీ నిర్వహించారు. ఈ పోటీలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు సృజనాత్మకత సరళిలో సమస్య తీవ్రతను విశ్లేషించి రాశారు. యాషన్, జీవన్, జోగేశ్వర్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు తులసీబాబు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. వీరితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలతో కణ్ణన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులసీబాబు

పోటీ పరీక్షలు ఉపయుక్తం

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల మేధస్సుకు పోటీ పరీక్షలు ఎంతో ఉపకరిస్తాయని కళ్యాణపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందబాబు పేర్కొన్నారు. పట్టణంలోని కళ్యాణపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభమా, నష్టమా.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై 'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఇలాంటి పోటీలు నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ పోటీలో విద్యార్థులు పాల్గొని తమ చిట్టి చిట్టిబుర్రలకు పదును పెట్టారన్నారు. విజేతలుగా నిలిచిన పునీత్, కావ్య, గణేష్‌కు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణయ్య, పద్మజ, భానుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేసిన ప్రధానోపాధ్యాయుడు ఆనందబాబు

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, తద్వారా మంచి ఫలితాలు సాధించాలని రాయలసీమ జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ గిరి పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మంచి వాతావరణం ఉందని, విద్యార్థులుగా బాగా చదివి ఉన్నత లక్ష్యాలు సాధించే దిశగా కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా గురువారం అంతర కళాశాలల క్రీడా పోటీల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను ఆయన అభినందించారు. కళాశాలలో రికార్డులు, పరిసరాలు పరిశీలించారు. వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, పీడీ సూరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులు సాధించిన కప్పు ఆర్జేడీ గిరికి చూపుతున్న ప్రిన్సిపల్ కోటేశ్వరయ్య

యూటీఎఫ్ అధ్యక్షుడిగా జానకిరామయ్య


జానకిరామయ్య మధు
పార్థసారథి సర్దార్

పెనుమూరు, న్యూస్‌టుడే: మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా జానకిరామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ స్వర్ణోత్సవ సభను పెనుమూరులో శుక్రవారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా మధు, గౌరవాధ్యక్షుడిగా దేవేంద్రనాయుడు, కోశాధికారిగా మోహన్, ఉపాధ్యక్షులుగా శాంతి, నరసింహులు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా తులసీరాం, గిరి, మీనా, హరికృష్ణ రేణుక, అమరావతి, రేవతి, జిల్లా కార్యదర్శులుగా కోదండరెడ్డి, బాబు, చిట్టిబాబు, సీపీఎస్ కన్వీనర్‌గా రాజేంద్రను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు, గౌరవాధ్యక్షుడు సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ బాషా పాల్గొన్నారు. **యాదమరిలో:** యూటీఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు, కార్యదర్శి మణికంఠ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా ఎం.శేఖర్, అధ్యక్షుడిగా పార్థసారథి, ప్రధాన కార్యదర్శిగా సర్దార్, అసోసియేట్ అధ్యక్షుడిగా సురేష్‌కుమార్ ఎన్నికయ్యారు. మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా జహరేనా, కోశాధికారిగా గిరిబాబు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యం, ఆడిట్ కమిటీ సభ్యులుగా చిట్టిబాబు, కార్యదర్శులుగా మూర్తి, తులసి, మునెయ్య, జ్యోతి, శారద, లతా, రాశి, మణిని ఎన్నుకున్నారు.

తాగునీటి వసతి పనులు త్వరగా పూర్తి చేయండి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న తాగునీటి వసతి పనులను నవంబర్ 15 లోగా పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్ అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్వేటినగరం ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ పరిధిలోని కార్వేటినగరం, శ్రీరంగరాజపురం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల్లో తాగునీటి సరఫరా పనుల్లో ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో తాగునీటి పైపులైన్ల లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని, అతిసారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఈఈ నరేంద్రకుమార్, ఏఈలు సతీష్‌కుమార్, గిరీష్, కుమారస్వామి, గాయత్రి పాల్గొన్నారు.


అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఈ విజయకుమార్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన నగరి విద్యార్థులు


నవ్యశ్రీ

నగరి, న్యూస్‌టుడే: నాగరాజుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మమత, నీరజ బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు మునిరత్నం శుక్రవారం తెలిపారు. జ్యోత్స్న అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైందన్నారు. వీరిని పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించినట్లు తెలిపారు. పీడీ చెన్నకేశవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ❖ ముడిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ చదరంగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ తెలిపారు. ఈ విద్యార్థినిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు. చదరంగం కోచ్ ఆనంద మోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.


నగరి: నాగరాజుకుప్పంలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

యాదమరి, న్యూస్‌టుడే: క్రీడలకు తెదేపా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి అమరనాథనాయుడు అన్నారు. నంద్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ అండర్-17 పోటీల్లో యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. యుగభారతి, మోనిష, బంగారు పతకాలు, మానస, ధరణి వెండి పతకాలు, ఫాతిమా పిరదోష్, పద్మావతి కాంస్య పతకాలు సాధించారు. వారిని శుక్రవారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. హెచ్.ఎమ్ గిరిరాజా, పీడీ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాదమరి: విజేతలతో అమరనాథనాయుడు, ఉపాధ్యాయులు

పశుగణనకు రైతులు సహకరించాలి

బంగారుపాళ్యం: పశుగణనకు రైతులు సహకరించాలని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. మండలంలోని నల్లగాంపల్లె సమీపంలో తెదేపా మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు మామిడి తోటలోని పశువుల లెక్కింపుతో కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించి, పశుగణన పత్రికను ఆయన ఆవిష్కరించారు. రైతులు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సహకరించి పశువుల లెక్కలు ఇవ్వాలన్నారు. ఆపై ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశంలో ప్రసంగించారు. తెదేపా మండల అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు కోకా ప్రకాష్ నాయుడు, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మండల క్లస్టర్ అధ్యక్షులు ధరణినాయుడు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు జయచంద్ర నాయుడు, మండల రైతు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షులు నేతాజీనాయుడు, కార్యదర్శి లోకనాథ నాయుడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, ఏడీ ఆసిఫ్, పశువైద్యులు ఝాన్సీ, ఆరిఫ్ పాల్గొన్నారు.


నల్లగాంపల్లెలో పశుగణన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, చిత్రంలో తెదేపా నాయకులు

ఎస్సై భారతి సేవలు అభినందనీయం

పాలసముద్రం, న్యూస్‌టుడే: గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో మహిళా ఎస్సైగా భారతి అందించిన సేవలు అభినందనీయమని సీఐ హనుమంతప్ప పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఎస్సై భారతిని పోలీసులు ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో ఎక్కడ విధులు చేపట్టినా ప్రజల మన్ననలు పొందేలా చట్టానికి కట్టుబడి విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం ఎస్సై భారతిని పోలీసులను శాలువతో సత్కరించారు. ఏఎస్ఐలు రవి, లక్ష్మి, ఖాదర్‌బాషా, బోస్, సుబ్రహ్మణ్యంనాయుడు, సునీల్, మహేష్, రమేష్ పాల్గొన్నారు.


ఎస్సై భారతిని సత్కరిస్తున్న ఏఎస్సైలు, పోలీసు సిబ్బంది

ఆధునిక వ్యవసాయమే మేలు..పుత్తూరు: ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాంకుమార్ పేర్కొన్నారు. రాస్ కార్యాయలంలో ఆధునిక వ్యవసాయంపై పుత్తూరు, నగరి మండలంలోని మహిళా రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. 30 సంవత్సరాలుగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సాగు ఖర్చులు తగ్గించుకుని, మంచి ఆదాయం పొందడానికి మెలకువలు నేర్పుతున్నట్లు చెప్పారు. మహిళలకు రుణకార్డులు అందజేశారు. రైతులు, రాస్ అధికారులు రవి, ప్రకాష్, మణి, శేఖర్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర రహదారికి మహర్దశ

* ఐదేళ్ల నిరీక్షణకు త్వరలో విముక్తి
* ఎమ్మెల్యే చొరవతో నిధుల మంజూరుకు కలెక్టర్ సుముఖం

యాదమరి, న్యూస్‌టుడే: గుంతలమయమైన చిత్తూరు గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారికి మహర్దశ పట్టనుంది.. ఐదేళ్లుగా వాహన చోదకుల నిరీక్షణకు తెర పడనుంది.. స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ చొరవతో రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేసేందుకు కలెక్టర్ సుమిత్‌కుమార్ సుముఖత వ్యక్తం చేశారు.


కొత్తూరు- గొల్లపల్లి మధ్యలో గుంతలమయమైన రహదారి

వైకాపా పాలనలో ఈ రహదారిని పట్టించుకోకపోవడంతో రాకపోకలు దయనీయంగా మారాయి, జోడిచింతల పోలీస్ స్టేషన్ నుంచి రాష్ట్ర సరిహద్దు కన్నికాపురం వరకూ రహదారి ఛిద్రమైంది. వర్షాలకు గోతుల్లో నీరు చేరి బురదమయమైంది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుండగా, నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్తగా ఈ మార్గాన్ని నిర్మించేందుకు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరడమే కాక కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత వర్షాలకు రహదారి మరింత దారుణంగా మారడంతో కలెక్టర్ స్పందించారు. తక్షణం రహదారి మరమ్మతులకు రూ.5 కోట్లు మంజూరు చేస్తామని, ఈ నిధులతో ఏ మేరకు, ఎంత దూరం రహదారి నిర్మాణం సాధ్యమనే అంచనాలు సిద్ధం చేసి అందించాలని రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఒకట్రెండ్రోజుల్లో అంచనాలు కలెక్టర్‌కు నివేదించాక నిధులు రాగానే టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారి తెలిపారు.


జోడిచింతల పోలీసుస్టేషన్ సమీపంలో ఏర్పడిన గొయ్యి

అప్పు చెల్లించలేక యువకుడి ఆత్మహత్య

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: స్థానిక ధర్మరాజుల కాలనీకి చెందిన మురళి(29) స్థానికంగా ఓ చికెన్ సెంటర్‌లో పనిచేస్తున్నాడు. కొద్దికాలం కిందట దుకాణ యజమాని నుంచి నగదు అప్పు తీసుకుని కట్టలేక అవస్థ పడ్డాడు. నగదు తిరిగి కట్టలేక మనస్తాపంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు.

వేర్వేరు కేసుల్లో తమిళవాసుల అరెస్టు

నగరి, న్యూస్‌టుడే: మండలంలోని తడుకుపేటలో రెండ్రోజుల క్రితం ఇంట్లోకి అర్ధరాత్రి ప్రవేశించి రెండు చరవాణులు చోరీ చేసిన కేసులో తమిళనాడుకు చెందిన వేలు, బాలచంద్, విజయ్‌కుమార్‌ను శుక్రవారం అరెస్టు చేశామని సీఐ మహేశ్వర్ శుక్రవారం తెలిపారు. ఈ నెల ఒకటో తేదీన తడుకుపేట జగనన్న కాలనీ వద్ద కత్తి చూపి రూ.2 వేలు దోపిడి చేసిన కేసులో తమిళనాడుకు చెందిన హుస్సేన్, నరేంద్రన్, అజిత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఈ ముగ్గురు తమిళనాడులోని అరక్కోణం నుంచి గంజాయి కోసం నగరి సమీపంలోకి వచ్చి డబ్బులు చాలక, దారినపోతున్న వారిని కత్తితో బెదిరించి డబ్బులు దోచుకున్నారని సీఐ పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

ఐరాల, న్యూస్‌టుడే: ఐరాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ఈ నెల 21 నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నరసింహులు తెలిపారు.

జిల్లేడుపల్లె గ్రామ సచివాలయంలో వివాదం

కంప్యూటర్ రైతు సేవా కేంద్రంలో
రికార్డులు పాఠశాలలో



జిల్లేడుపల్లె రైతు భరోసా కేంద్రంలో కంప్యూటర్

బంగారుపాళ్యం,న్యూస్‌టుడే జిల్లేడుపల్లెలోని గ్రామ సచివాలయం నిర్వహిస్తున్న పంచాయతీ భవనం వర్షాలకు ఉరుస్తోంది. దీంతో రికార్డులు, ఫర్నీచర్, కంప్యూటర్‌ను జిల్లేడుపల్లె, తంబుగానిపల్లె మార్గమధ్యలోని రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్లేందుకు సిబ్బంది యత్నించారు. సర్పంచి భారతి, గ్రామస్థులు కొందరు సామగ్రిని తరలించవద్దని మూడ్రోజుల వ్యవధిలో సచివాలయ నిర్వహణకు వసతులు కలిగిన భవనం సమకూర్చుతామని, అప్పటి వరకు గ్రామంలోని పాఠశాల భవనంపై నిర్వహించాలని చెప్పారు. ఇందుకు సచివాలయ సిబ్బంది అంగీకరించక కంప్యూటర్ తీసుకెళ్లి రైతు సేవా కేంద్రంలో ఉంచారు. మిగిలిన సామగ్రిని తీసుకెళ్లేందుకు యత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రీధర్‌ను శుక్రవారం సంప్రదించగా గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది మధ్య వివాదం జరిగిందని, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.


తాళం వేసిన గ్రామ సచివాలయ భవనం

బిల్లులు చెల్లిస్తే తాళం ఇస్తా..

గ్రామ సచివాలయ భవన నిర్మాణం గత ప్రభుత్వంలో రూ.40 లక్షలతో చేపట్టారు. భవనం నిర్మాణం పూర్తికాగా.. విద్యుత్తు, మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. చేపట్టిన పనులకు ఇప్పటికి రూ.25లక్షలు పైగా చెల్లించారు. మిగిలిన బిల్లు ఇస్తే పనులు పూర్తిచేస్తానని గుత్తేదారు సచివాలయానికి తాళం వేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌ను సంప్రదించగా భవనానికి తాళం వేసిన విషయం వాస్తవమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. పాఠశాల మిద్దెపైన నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గ్రామస్థులు ఉరుస్తున్న పంచాయతీ భవనంలోకి తరలించారు. భవనం పెచ్చులు ఊడుతుండటంతో పిల్లలను భవనం ముందున్న వరండాలో ఉంచారు. వర్షం వస్తే రికార్డులు తడుస్తాయని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు.

అమెరికాలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్


ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సత్కరిస్తున్న ఎన్ఆర్ఐ తెదేపా బృందం

నగరి, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమెరికా పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ తెదేపా నాయకులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

పలమనేరు

•పలమనేరు •కుప్పం •పుంగనూరు

'బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్' ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

శాంతిపురం, న్యూస్‌టుడే: జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు శాంతిపురంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమంతరావు వెల్లడించారు. స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో రూ.50 లక్షలతో నిర్మించిన భవనంలో వసతులను శుక్రవారం ఆయన పరిశీలించారు. తెలిపారు. వైద్యులు వంశీకృష్ణ, ప్రసాద్, కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో

పలమనేరు: పలమనేరు ఆర్డీవోగా భవాని బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలోని తన ఛాంబర్లో శుక్రవారం విధుల్లో చేరారు. గతంలో చిత్తూరు కలెక్టరేట్ ఫారెస్టు సెటిల్‌మెంటు అధికారిగా పనిచేశారు. ఇక్కడ ఆర్డీవోగా ఉన్న మనోజ్‌రెడ్డి కడపకు వెళ్లారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

సమయ పాలన పాటించాలి

పుంగనూరు: సచివాలయ ఉద్యోగులు విధుల నిర్వహణలో సమయ పాలన పాటించాలని పురపాలక ఛైర్మన్ అలీంబాషా, కమిషనరు మధుసూదనరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని తూర్పు మొగశాలలోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజల వినతుల పరిష్కారంలో జాప్యం చేయరాదని సచివాలయ ఉద్యోగుల పరిధిలో లేని వినతులను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు గడువు పొడగింపు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: డీఎస్సీ శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఈ నెల 27 వరకు పొడిగించినట్లు ఎంపీడీవో నరసింహులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం

స్వాతంత్ర్య పోరాట యోధుడు దేవర్

కుప్పం పట్టణం: బ్రిటీషు వారితో దేశ స్వాతంత్ర్యానికి పోరాడిన యోధుడు పసుంపొన్ను ముత్తు రామలింగం దేవర్ అని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్‌మునిరత్నం అన్నారు. పసుంపొన్ను ముత్తు రామలింగం దేవర్ 116వ జయంతిని పిరమాల్లై కల్లర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. నాయకులు రాజ్‌కుమార్, నరేష్, వెంకటేష్, సత్యేంద్రశేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, సంఘ నాయకులు శివ దేవర్, ఈశ్వర్ దేవర్, రవి తదితరులు పాల్గొన్నారు.

● కుప్పం పురపాలికను గ్రీన్-క్లీన్ కుప్పంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. పట్టణం ప్రధాన రహదారిలోని శ్రీప్రసన్న గంగమ్మ దేవాలయ సమీపంలో శుక్రవారం మొక్కలు నాటారు. కమిషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, మున్సిపల్ తెదేపా అధ్యక్షుడు రాజ్‌కుమార్, జనసేన కన్వీనర్ నరేష్, మాజీ ఎంపీపీ వెంకటేష్ పాల్గొన్నారు.



విద్యార్థులతో గువ్వల రమేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు

క్రీడాకారులను అభినందించిన గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎంపికైన చిత్తూరు జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులను శుక్రవారం మండల తెదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అభినందించారు. మూడు రోజులుగా పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులను పరిచయం చేసుకుని ఆటల పోటీల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు.

పోలీసు లాంఛనాలతో దహన సంస్కారాలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పుంగనూరు మండలం సుగాలిమిట్ట పంచాయతీ చినతండా గ్రామానికి చెందిన మునియానాయక్, కమలమ్మ దంపతుల కుమారుడు విజయ్‌కుమార్(47) తిరుపతిలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. శుక్రవారం స్వగ్రామంలో పోలీసు లాంఛనాలతో దహన సంస్కారాలు నిర్వహించారు.



విజయకుమార్ దహన సంస్కారంలో పాల్గొన్న తిరుపతి పోలీసులు



బాలుర ఎస్సీ వసతి గృహంలో పెచ్చులూడిన దృశ్యం



పలమనేరు: మ్యాట్లు లేకపోవడంతో చినిగిన చాపలపై నిద్రిస్తున్న విద్యార్థులు



చౌడేపల్లె ఎస్సీ బాలుర వసతి గృహంలో కిటికీలకు దుప్పట్లు కట్టిన వైనం



శాంతిపురం: దెబ్బతిన్న కిటికీ తలుపులు

వసతి గృహాల్లో

కరవైన వసతులు

అసౌకర్యాల నడుమ విద్యార్థులు



పెచ్చులు ఊడుతున్న పుంగనూరు బీసీ బాలుర వసతి గృహం భవనం



కల్లూరు బాలుర వసతిగృహంలో మెస్‌లు లేని కిటికీలు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: గత ఐదేళ్లలో వైకాపా పాలకులు వసతిగృహాల పట్ల శ్రద్ధ చూపలేదు. వారి నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ వసతిగృహాల్లోని విద్యార్థులు అసౌకర్యాల నడుమ కాలం వెల్లదీస్తున్నారు. భవనాల మరమ్మతులకు చొరవ చూపకపోవడంతో చాలా వరకు భవనాలు వర్షాలకు ఉరుస్తూ విద్యార్థులకు కంటిమీద కునుకు లేకుండా ఉంది. కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలో 39 వసతిగృహాలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు మూడు వేల మంది విద్యార్థులు ఉంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. వీటిలో చాలా వరకు భవనాలు అసౌకర్యంగా ఉన్నాయి. చాలీచాలని దుప్పట్లు, పడుకునేందుకు కార్పెట్లు లేకపోవడం వంటి సమస్యలు పిల్లలను పీడిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో తాము ఎలా చదువుకోవాలనే మాటలు వారి నుంచి వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా చొరవచూపి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అంగన్‌వాడీ కేంద్రాలకు కుక్కర్ల బహూకరణ

పలమనేరు, న్యూస్‌టుడే: కొలమాసనపల్లె సెక్టార్‌లో అంగన్‌వాడి కేంద్రాలకు ఉచితంగా ప్రెషర్ కుక్కర్లు, నీళ్ల క్యాన్లు, మ్యాట్లు ఉచితంగా పంపిణీ చేశారు. శుక్రవారం పలమనేరు శ్రీపురం సీతారామయ్య, నాగమణి చారిటబుల్ ట్రస్టు, రత్నాబయోటెక్ సంయుక్తంగా దాతలు ట్రస్టు కార్యాలయంలో 25 చొప్పున కుక్కర్లు, నీళ్లక్యాన్లు, మ్యాట్‌లు అంగన్‌వాడి కేంద్రాల కార్యకర్తలకు అందించారు.

పశుగణనకు సహకరించాలి.. పుంగనూరు: నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు భాగస్వామ్యంతో చేపట్టిన పశుగణనకు పశుపోషకులు సహకరించాలని పశువైద్య సహాయ సంచాలకులు డా. మనోహర్ అన్నారు. శుక్రవారం చదళ్లలో పశుగణన ప్రారంభం సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. తెదేపా నాయకులు వెంకటరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చూపి.. బహుమతి పొంది



బహుమతులు అందుకున్న విద్యార్థులు

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని నారాయణ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో విద్యార్థులు ఈనాడు ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొన్నారు. శుక్రవారం పాఠశాలలోని 8,9,10 తరగతులకు చెందిన విద్యార్థులకు ఇంటర్‌నెట్‌తో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు చేపట్టారు. అందులో 9వ తరగతికి చెందిన సిరిచందన, 10వ తరగతికి చెందిన చంద్రిక, 8వ తరగతికి చెందిన సహస్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సాధించారు. ప్రధానోపాధ్యాయుడు ధరణికుమార్ విజేతలకు బహుమతులు అందించారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శిరీష్

లోక్‌అదాలత్ విజయవంతం చేయండి

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక కోర్టు ఆవరణలో డిసెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేద్దామని సీనియర్ సివిల్ జడ్జి శిరీష్ అన్నారు. శుక్రవారం పోలీస్ శాఖాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజీకి అనువైన కేసులన్నింటినీ రాజీ చేసుకోవడానికి కక్షిదారులు ముందుకు రావాలన్నారు. వారికి అవసరమైన సహకారాన్ని అధికారులు, న్యాయవాదులు అందించాలన్నారు. సమావేశంలో పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని మేలుపొడ్డి పంచాయతీ మద్దనపల్లె గ్రామంలో మురుగు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. **- శ్రీనప్ప, మద్దనపల్లె**

సమాధానం: గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం **- లీలామాధవి, ఎంపీడీవో పుంగనూరు**

వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు

స్పందనకు వందనం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని అనిమిగానిపల్లె నుంచి కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి దాకా వీధి దీపాలు ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేసినట్లు పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈనాడు దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'వీధి దీపాలు వెలిగేనా..?' శీర్షికపై ఆయన స్పందించారు.

దాత వితరణతో మరమ్మతులు

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక మినీ బైపాస్ మార్గంలో నడిరోడ్డులో గల గోతులను శుక్రవారం పూడ్చి వేశారు. ఈనాడు దినపత్రికలో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికతో వార్త రావడంతో విశ్రాంత డీఎస్పీ, తెదేపా నాయకుడు సుకుమార్ బాబు తన సొంత నిధులతో గోతులను పూడ్చారు.



ప్రధాన రహదారిపై ఏనుగుల గుంపు

కల్లూరు: పంట పొలాలపై పడి రైతులకు అపారనష్టం కలిగిస్తున్న ఏనుగుల గుంపు శుక్రవారం ఉదయం పట్టపగలు కల్లూరు నుంచి పులిచెర్లకు వెళ్లే మార్గంలోని ప్రధాన రహదారిపైకి వచ్చింది. స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న తూర్పు విభాగం అటవీశాఖ రేంజర్ థామస్‌కుమార్, కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్సై వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని వాటిని తరిమేందుకు అటవీ అధికారులు టపాసులు పేల్చారు.

సమస్యలు పరిష్కరించండి సారూ



వినతులు స్వీకరిస్తున్న జేసీ విద్యాధరి, కడా పి.డి. వికాస్ మర్మత్

కుప్పం పట్టణం: తమ సమస్యలు ఆలకించి. . వాటిని పరిష్కారానికి చొరవ చూపాలంటూ ప్రజలు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతులిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు పలు సమస్యలపై వినతులను జిల్లా పాలనాధికారికి సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖాధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో జేసీ విద్యాధరి, కడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ రాష్ట్ర వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. బీఆర్ సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.

రుణాలు ఇప్పించండి

పురపాలిక పరిధిలోని దళవాయి కొత్తపల్లెలో ఉన్న గంగమ్మ మహిళా పొదుపు సంఘం ద్వారా బ్యాంకులో రుణం పొందాం. గ్రూపు సభ్యులైన మేము తీసుకున్న రుణం కట్టేస్తామని, కొత్త రుణం ఇప్పించాలని డ్వామా అధికారులను కోరితే వారు డబ్బులను అడుగుతున్నారు. ఇవ్వనందుకు రుణం ఇప్పించడం లేదు. **విజయమ్మ, రాజమ్మ, మమత, దళవాయికొత్తపల్లె**





పాఠశాల భవనం కట్టించండి

మండల పరిధిలోని మారప్పల్లి గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకొని ప్రమాదకరంగా మారింది. భవనం పెచ్చులూడి వర్షపు నీరు ఉరుస్తోంది. అధికారులు స్పందించి పాఠశాలకు నూతన భవనం మంజూరు చేయించాలి. **- జయశ్రీ, బుజ్జి, మల్లిక, తేజ, పద్మ మారప్పల్లి, కుప్పం మండలం**

భూమికి రోడ్డు కల్పించాలి



రామకుప్పం మండలం గొరివిమాకులపల్లి గ్రామ పంచాయతీలో నా కుమార్తె భూమిని కొనుగోలు చేసింది. భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ సైతం జరిగింది. భూమి మూలపత్రంలో రోడ్డు ఉన్న ఆస్తిని మాకు విక్రయించారు. ఆ పత్రంలో దారి చూపకపోవడంతో వ్యవసాయం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నా కుమార్తె కొనుగోలు చేసిన భూమికి రోడ్డు కల్పించాలి.
- వెంకటేష్, రామకుప్పం

ప్రమాదవశాత్తు తాపీమేస్త్రీ మృతి

రొంపిచెర్ల, కల్లూరు, న్యూస్‌టుడే: రొంపిచెర్ల ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ గది నిర్మాణ పనులు చేస్తూ తాపీ మేస్త్రీ మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రొంపిచెర్ల మండలం బండకిందపల్లెకు చెందిన అహమ్మద్ బాషా(19) రొంపిచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ గది పైకప్పు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. తలకు గాయం కావడంతో రొంపిచెర్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా రుయాకు తరలించగా అహమ్మద్‌బాషా మృతి చెందాడు. జిల్లా సర్వశిక్షా కోఆర్డినేటరు వెంకటరమణారెడ్డి కలెక్టరుకు విషయం చెప్పడంతో రూ. లక్ష ఆర్థిక సాయం అందించారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టరు డ్రైవరు మృతి

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలం జ్యోతినగర్ సమీపంలోని స్టోన్ క్రషర్‌లో ట్రాక్టరు డ్రైవరుగా పని చేస్తున్న ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వెంకటేష్ స్టోన్ క్రషర్‌లో శుక్రవారం పని లేకపోవడంతో రాతి కూసాలు చీల్చే పనికి వెళ్లారు. ట్రాక్టరు నడుపుతూ రివర్స్ వెళ్లే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పింది. లోయలో పడుతుందని భావించిన వెంకటేష్ కిందకు దూకారు. ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కల్లూరు సీఐ సూర్యనారాయణ, ఎస్సై వెంకటేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బాబు తెలిపారు. శుక్రవారం ఆమేరకు ఒక ప్రకటన ఇక్కడ విడుదల చేశారు.

ఆటో దొంగల అరెస్టు

వి.కోట, న్యూస్‌టుడే: అంతరాష్ట్ర ఆటోల దొంగల ముఠాను వి.కోట పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సీఐ సోమశేఖర్‌రెడ్డి వివరాల మేరకు.. కొంతకాలంగా వి.కోటలో ఆటోలు అపహరణకు గురికావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్థానిక బాపుజీ, ఖాజీపేటలకు చెందిన సోను, సల్మాన్, జబీ, సుభాన్‌లు మండల పరిధిలోని కనుమనాయనపల్లె గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద ఆటోలతో అనుమానంగా కనిపించారు. పోలీసులు పట్టుకొని విచారించగా అసలు విషయం చెప్పినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన ఆటోలను తమిళనాడులో విక్రయించేవారన్నారు. రూ.10లక్షల విలువ చేసే 6 ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



పొలాన్ని పరిశీలిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రైతులను ఆదుకోవడంతో అటవీ అధికారుల వైఫల్యం

కల్లూరు: పులిచెర్ల మండలంలో ఏనుగులు పంట పొలాలపై పడి రైతులకు నష్టం కలిగిస్తున్నా అటవీ అధికారులు వాటిని కట్టడి చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లారామచంద్రారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన అయ్యవాండ్లపల్లె పంచాయతీలో పర్యటించారు. ఏనుగుల దాడిలో నాశనమైన పొలాలను సందర్శించి రైతుల సమస్యను అటవీ అధికారులకు చెబుతున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.

శ్రీగంధం చెట్టు నరికివేత

పుంగనూరు, న్యూస్‌టుడే: స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో గల శ్రీగంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికి తీసుకెళ్లారు. శనివారం రాత్రి వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్తు రంపంతో చెట్టు మొదలు, కొమ్మలు కత్తిరించి తరలించారు. వర్షం నిలిచిన తర్వాత విధుల్లో ఉన్న సిబ్బంది గమనించి వైద్యుడి దృష్టికి తీసుకురాగా ఆయన సూపరింటెండెంట్ మధుసూదనాచారికి సమాచారం అందించారు. చెట్టు పైకొమ్మలు సైతం భద్రపరచి విషయాన్ని డీసీహెచ్‌ఎస్, అటవీశాఖ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు.



ఆటో ఢీ.. దంపతులకు తీవ్ర గాయాలు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం గుంతవారిపల్లె గ్రామానికి చెందిన దంపతులు నీలావతి, గోవిందరెడ్డి గురువారం రాత్రి రామసముద్రం నుంచి గ్రామానికి వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆటో అదుపుతప్పి ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తాపడటంతో భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

జూదరుల అరెస్టు.. రూ.2.42 లక్షలు స్వాధీనం

పుంగనూరు గ్రామీణ: మండలంలోని సుగాలిమిట్ట అటవీ ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో శుక్రవారం పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడిలో మరో ఇద్దరు తప్పించుకున్నారు. వారి నుంచి రూ. 2.42 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.